# ఓ స్ఫూర్తి కథ

**- ఇ.టి. రామారావు**

ఉదయం పోస్టులో వచ్చిన ఉత్తరం చదివినప్పటి నుంచి విమల మనసు అస్థిమితంగా తయారయింది. ఆఫీసు పని మీద కూడా మనసు లగ్నం చేయలేక మధ్యాహ్నం వరకు ఎలాగో గడిపింది. లంచ్ అవర్లో ఆ ఉత్తరం మళ్లీ చదవసాగింది.



"అక్కా!

కొద్ది రోజులుగా నాన్న గారి ఆరోగ్యం బావుండటంలేదు. ఒకటే దగ్గు, ఆయాసం! రాత్రిళ్లు నిద్రపట్టక చాలా బాధపడుతూ ఉంటారు. డాక్టరు దగ్గరికి వెళ్లమంటే నవ్వి ఊరుకుంటారు. ఇలా కాదని మొన్నొక రోజు నేనే బలవంతంగా తీసుకెళ్లాను. ఎక్స్‌రే, ఇసిజి స్కానింగ్ లాంటి చాలా పరీక్షలు చేయించమన్నారు. ఆ టెస్టులకు, మందులకు దాదాపు వెయ్యి రూపాయలుపైగా అయ్యేట్లు ఉన్నాయి. అంత డబ్బు లేక అవన్నీ చేయించలేదు. కాని అవన్నీ చేయించి సరైన మందులు వాడితే తప్ప నాన్న గారి ఆరోగ్యం బాగుపడదని డాక్టరు చెప్పాడు. ఏం చేయాలో పాలుపోవటంలేదు. నాన్న గారి పెన్షన్ రావటానికి ఇంకా పదిహేను రోజులపైనే ఆగాలి. అయినా ఆ డబ్బు దీని కోసం ఖర్చు పెడితే నెలంతా ఎలా గడపాలి? ఏం తోచడంలేదక్కా! నీకు రాస్తానంటే వద్దన్నారు నాన్న. కాని రాయకుండా ఉండలేకపోతున్నాను. నీకు వీలైతే వెంటనే వెయ్యి రూపాయలు పంపగలవా? మరీ అంత ఇబ్బంది అయితే దీన్ని గురించి ఆలోచించకు. వీలైతే ఒకసారి వచ్చి నాన్నను చూసివెళ్లు.

పల్లవి ఎలా ఉంది? స్కూలుకి వెళుతోందనుకుంటాను. దానికి నా ముద్దులు తెలియచెయ్యి. నువ్వు వచ్చే పనైతే దాన్ని కూడా వెంటబెట్టుకురా! చూసి చాలా కాలమైంది. ఉంటానక్కా!

- రమ"

ఉత్తరం మడిచి బ్యాగ్‌లో పెట్టుకుంటూ భారంగా నిట్టూర్చింది విమల. తండ్రికి ఎలా ఉందోనన్న ఆలోచన ఆమె మనసుని తీవ్ర ఆందోళనకు గురి చేస్తూ ఉంది. వెంటనే వెళ్లి ఆయన్ని చూడాలని మనసు ఆరాటపడుతోంది.

విమలకు తండ్రి అంటే చాలా ఇష్టం! తల్లి చనిపోయే నాటికి తన వయసు పదహారేళ్లు. చెల్లెలు రమకి పన్నెండేళ్లు. తల్లిలేని లోటు తెలియకుండా తా.మిద్దరినీ ఎంతో అనురాగంతో పెంచి పెద్ద చేశారాయన. గవర్నమెంటు ఆఫీసులో అతి చిన్న ఉద్యోగి అయినా తనను డిగ్రీ వరకు చదివించాడు. తన పెళ్లి కోసం రిటైర్‌మెంట్ సమయాన వచ్చిన డబ్బంతా ఖర్చు చేయటమే కాకుండా పెన్షన్‌లో మూడో వంతు కూడా అమ్మివేశాడు. ఇప్పుడాయనకు ఏ ఐదారు వందలో పెన్షన్ వస్తుంది. దాంతో ఆయన, చెల్లెలు ఇద్దరూ గడపాలి. చెల్లెలి కాలేజీ ఫీజులు, పుస్తకాల ఖర్చు అన్నీ ఆ కొద్దిపాటి డబ్బులోనే సర్దుకోవాలి. ఇక రోగం వస్తే మందులకి, డాక్టరు ఫీజులకి ఎక్కడ నుంచి తేగలరు!

రెండేళ్ల నుంచీ తాను ఉద్యోగం చేస్తూ ఉంది. నెలకు దాదాపు రెండు వేలు సంపాదిస్తూ అంతా భర్త చేతిలో పెడుతూ ఉంది. తనకంటూ ఒక్క పయాపైసా దాచుకోలేదు. ఏది కొనాలన్నా ఏం చెయ్యాలన్నా అంతా ఆయనిష్టమే! తనకు స్వాతంత్ర్యంలేదు. జీతం రాగానే తీసుకెళ్లి ఆయన చేతిలో పెట్టాలి. బస్సు చార్జీలకి నెలకింత తన చేతికిస్తాడు.

ఇలాంటి సమయంలోనైనా తండ్రికి ఒక వెయ్యి రూపాయలు పంపకపోతే ఎలా? ఏనాడూ తనని ఒక్క రూపాయి అడగలేదు నాన్న, చెల్లెలు. ఇప్పుడు కూడా చెల్లెలు రాసిందంటే గత్యంతరంలేని పరిస్థితులే కారణం! సాయంత్రం ఇంటికెళ్లి భర్తతో ఈ విషయం చెప్పి వెయ్యి రూపాయలు అడిగి తీసుకొని నాన్న దగ్గరకు వెళ్లిరావాలి! అనుకుంటూ టైప్‌మిషన్ ముందుకు లాక్కొని పనిలో పడింది విమల!

*** *** ***

సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికొచ్చి పనిమనిషి స్వరాజ్యం ఇచ్చిన కాఫీ తాగి భర్త రాక కోసం ఎదురుచూస్తూ ఉంది విమల. పల్లవి ఆటల నుంచి ఇంటికి రాగానే స్వరాజ్యం ఆ పాపకు స్నానం చేయించి బట్టలు మార్చింది. పుస్తకాలు తెచ్చుకుని తల్లి దగ్గర వచ్చి కూర్చుంది పల్లవి.

"అమ్మగారూ! అన్నం వండేసి వెళ్లమంటారా?" స్వరాజ్యం వంటింట్లో నుంచి కేకేసింది. విమల ఎప్పుడైనా హుషారుగా లేనప్పుడు రాత్రి వంట కూడా తనే చేసి వెళుతుంది స్వరాజ్యం. ఈ రోజు తను అంత హుషారుగా లేని విషయం అప్పుడే కనిపెట్టేసినట్లుంది ఈ పిల్ల! అనుకుంటూ "అలాగే కానియ్ రాజ్యం!" అని బదులిచ్చింది విమల చాలా నెమ్మదస్తురాలు, నమ్మకమైనది స్వరాజ్యం. మూడేళ్లుగా విమల వాళ్లింట్లో పనిచేస్తున్నది.

పల్లవి ఏవో ప్రశ్నలు అడుగుతున్నా అన్యమనస్కంగానే సమాధానాలు చెబుతూ ఉంది విమల.

ఏడు గంటలప్పుడు వచ్చాడు విమల భర్త చక్రపాణి.

"ఏమిటలా ఉన్నావు?" రాగానే భార్య ముఖం వంక చూసి అడిగాడు చక్రపాణి. అతని వెంట బెడ్‌రూంలోకి నడిచింది విమల.

"మా నాన్నకు ఒంట్లో బావుండటంలేదట. రమ ఉత్తరం రాసింది" అంటూ తన చేతిలో ఉత్తరాన్ని అతనికి అందించింది.

రెండు నిముషాలలో దాన్ని చదవటం పూర్తి చేసి తిరిగి భార్య చేతికి అందించి

